గంటకు 24 మందిపై వేటు

- రెండేండ్లలో 4.25 లక్షల మంది టెకీలకు ఉద్వాసన
- ఉద్యోగాలకు ఎసరు పెడుతున్న కృత్రిమ మేధ

న్యూఢిల్లీ, డిసెంబర్ 26: ఆధునిక సాంకేతికతల్లో ఒకటైన కృత్రిమ మేధ (ఏఐ) ఏటా లక్షల ఉద్యోగాలకు ఎసరు పెడుతున్నది. ఈ సాంకేతికత వినియోగం నానాటికీ పెరుగుతుండటంతో ప్రపంచవ్యాప్తంగా టెక్ కంపెనీలు, స్టార్టప్‌లు ఉద్యోగులపై వేటు వేస్తున్నాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మందగమన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఖర్చులను తగ్గించుకునేందుకు ఉద్యోగులను తొలగిస్తున్నట్టు ఆయా కంపెనీలు చెప్తున్నాయి. ఇలా గత రెండేండ్లలో (2023 డిసెంబర్ 26 వరకు) ప్రపంచవ్యాప్తంగా 4.25 లక్షల మందికిపైగా ఉద్యోగులు తొలగింపునకు గురయ్యారు. వీరిలో 36 వేల మందికిపైగా ఉద్యోగులు భారత్‌లోనే ఉద్వాసనకు గురైనట్టు స్పష్టమవుతున్నది. ఈ ఏడాది రిటైల్ టెక్, కన్స్యూమర్ టెక్, ఫిన్‌టెక్ రంగాలకు చెందిన కంపెనీలు అధిక సంఖ్యలో ఉద్యోగులను తొలగించినట్టు 'లేఆఫ్స్.ఎఫ్‌వైఐ' వెబ్‌సైట్ వెల్లడించింది.

ఉద్యోగాల ఊచకోత

ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాల ఊచకోత కొనసాగుతున్నది. ఏఐ వినియోగం పెరగడంతో టెకీలు ఉద్యోగాలు కోల్పోతున్నారు.

గత రెండేండ్లలో ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాలు కోల్పోయిన టెక్ ఉద్యోగులు **4.25** లక్షల మంది	భారత్‌లో ఉద్యోగాలు కోల్పోయినవారు **35** వేల మంది	
ఈ ఏడాది ఉద్యోగాలు కోల్పోయిన వారి సంఖ్య **2,60,771**	ఉద్యోగులను తొలగించిన కంపెనీల సంఖ్య **1,178**	గత రెండేండ్లలో సగటున రోజుకు ఉద్యోగాలు కోల్పోయిన వారు **582** మంది
గత ఏడాది ఉద్యోగాలు కోల్పోయిన వారి సంఖ్య **1,64,769**	ఉద్యోగులను తొలగించిన కంపెనీల సంఖ్య **1,061**	

ఈ ఏడాది భారీగా ఉద్యోగులను తొలగించిన కంపెనీలు

- ఖర్చుల తగ్గింపు, వ్యాపార పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా 'పేటీఎం' సంస్థ 1,000 మందికిపైగా ఉద్యోగులను తొలగించింది.
- ప్రముఖ సామాజిక మాధ్యమం 'షేర్‌చాట్' 200 మంది ఉద్యోగులపై వేటు వేసింది. ఇది ఆ సంస్థ మొత్తం శ్రామికశక్తిలో దాదాపు 15 శాతానికి సమానం.
- గేమ్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ 'లోకో' తన మొత్తం 110 మంది ఉద్యోగుల్లో 40 మందిని (36 శాతం) తొలగించింది.
- టెక్ దిగ్గజం గూగుల్ ఆధ్వర్యంలోని ఎడ్‌టెక్ ప్లాట్‌ఫామ్ 'అడ్డా 247' దాదాపు 300 మంది ఉద్యోగులపై వేటు వేసింది.
- ఎడ్‌టెక్ దిగ్గజం 'బైజూస్' దాదాపు 5 వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. దీంతో గత రెండేండ్లలో ఈ స్టార్టప్ తొలగించిన మొత్తం ఉద్యోగుల సంఖ్య 10 వేలు దాటింది.
- ఈ ఏడాది ఇప్పటికే రెండు విడతల్లో 400 మంది ఉద్యోగులపై వేటు వేసిన కిరాణా సరుకుల డెలివరీ సంస్థ 'డంజో' సెప్టెంబర్‌లో మరో 200 మంది వరకు ఉద్యోగులను తొలగించింది.



ఎలక్ట్రానిక్ మట్టి!

- పంట ఎదిగేందుకు దోహదం
- 15 రోజుల్లో 50% అధికంగా పెరిగిన బార్లీ మొలకలు
- స్వీడన్ పరిశోధకుల అభివృద్ధి

లండన్, డిసెంబర్ 26: భూమి లేదా మట్టి అవసరం లేకుండా చేసే వ్యవసాయ పద్ధతి 'హైడ్రోపోనిక్స్' కోసం స్వీడన్ పరిశోధకులు 'ఎలక్ట్రానిక్ మట్టి'ని అభివృద్ధి చేశారు. ఈ తరహా మట్టిలో బార్లీ మొలకల వేర్లను విద్యుత్తుతో ఉద్దీపన చేయటం ద్వారా, మొలకలు 15 రోజుల్లో సగటున 50 శాతం కన్నా ఎక్కువ వృద్ధి చెందినట్టు 'పీఎన్ఏఎస్' జర్నల్ తాజా కథనం పేర్కొన్నది. హైడ్రోపోనిక్స్ సాగుకు దోహదపడే 'ఎలక్ట్రానిక్ మట్టి'ని లింకోపింగ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎలిని స్ట్రావిండో నేతృత్వంలోని సైంటిస్టుల బృందం తయారుచేసింది. దీనికి వారు 'ఈ-సాయిల్' అనే పేరు పెట్టారు. ఎలిని స్ట్రావిండో మాట్లాడుతూ, 'పర్యావరణ మార్పులకు తోడు ప్రపంచ జనాభా నానాటికీ పెరుగుతున్నది. సంప్రదాయ వ్యవసాయ పద్ధతులతో ఆహార డిమాండ్‌ను ఎదుర్కొనలేం. 'హైడ్రోపోనిక్స్' విధానంలో పట్టణ ప్రాంతాల్లో ఆహారాన్ని ఉత్పత్తి చేయవచ్చు' అని అన్నారు. తమ పరిశోధన హైడ్రోపోనిక్స్ సాగును మరింత విస్తృత పర్చిందన్నారు. ప్రతికూల వాతావరణం, తక్కువ సాగుయోగ్యమైన భూమి ఉన్న చోట 'హైడ్రోపోనిక్స్ సాగు' పరిష్కారం చూపుతుందని చెప్పారు.

హైడ్రోపోనిక్ ఫార్మింగ్ అంటే?

హైడ్రోపోనిక్ ఫార్మింగ్.. ఇటీవల పట్టణాల్లో ఎక్కువగా వినిపిస్తున్న మాట. భూమి లేదా మట్టి అవసరం లేకుండా, మనం ఎంచుకున్న చోట కేవలం నీటి ఆధారంగా పంటలు సాగు చేపట్టడాన్ని 'హైడ్రోపోనిక్ ఫార్మింగ్' అని పిలుస్తారు. మొక్కల ఎదుగుదలకు నీరు, పోషకాలు అవసరమైనంత అందించేందుకు క్లోజ్డ్ సిస్టమ్ ఏర్పాటుచేస్తారు. క్లోజ్డ్ సిస్టమ్ సమర్థంగా పనిచేసేందుకు 'ఈ-సాయిల్'ను సైంటిస్టులు తయారుచేశారు. కూరగాయలు, ఔషధ గుణాలుండే మొక్కల్ని పెంచేందుకు ఈ తరహా సాగు అనుకూలంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. సాధారణ వ్యవసాయం సాధ్యం కాని చోట ఈ విధానాన్ని అనుసరించి పంటను పొందవచ్చు. కలుపు సమస్య, చీడపీడల బాధ పెద్దగా ఉండదని నిపుణులు పేర్కొన్నారు.

రామమందిరంపై రాజకీయ రగడ

- ప్రారంభోత్సవ ఆహ్వానాన్ని తిరస్కరించిన సీపీఎం
- జనవరి 22న తమ వైఖరి తెలుస్తుందన్న కాంగ్రెస్
- రాముడి పిలుపు అందుకున్న వాళ్లే వస్తారన్న బీజేపీ

సీతారాం ఏచూరి

కేసీ వేణుగోపాల్

న్యూఢిల్లీ, డిసెంబర్ 26: అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవంపై రాజకీయ వివాదం మొదలైంది. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి రావాలన్న ఆహ్వానాన్ని సీపీఎం తిరస్కరించింది. ప్రజల మత విశ్వాసాలతో రాజకీయాలు చేస్తున్నారని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నది. తాను ప్రారంభోత్సవానికి హాజరు కావడం లేదని సీపీఎం జనరల్ సెక్రటరీ సీతారాం ఏచూరి తెలిపారు. మతపరమైన కార్యక్రమాన్ని రాజకీయం చేస్తున్నారని విమర్శిస్తూ సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్ కూడా ఆహ్వానాన్ని తిరస్కరించారు. కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే ప్రాణ ప్రతిష్ఠాపనకు హాజరవుతారా లేదా అన్నదానిపైనా చర్చ జరుగుతున్నది. కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత అధీర్ చౌదరికి, మాజీ ప్రధాని మన్మోహన్‌కు కూడా ఆహ్వానం అందింది. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ మీడియాతో మాట్లాడుతూ.. 'మా పార్టీ వైఖరి గురించి జనవరి 22న తెలుస్తుంది. ఆహ్వానించినందుకు ధన్యవాదాలు. చూద్దాం ఏం జరుగుతుందో' అని అన్నారు.

సీపీఎం వైఖరిపై ఆగ్రహం

సీపీఎం వైఖరిని బీజేపీ తప్పుపట్టింది. కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి మాట్లాడుతూ 'ఆహ్వానాలు అందరికీ పంపాం. రాముడి పిలుపు అందుకున్న వాళ్లు మాత్రమే వస్తారు' అని అన్నారు. సీపీఎం వైఖరిని వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి వినోద్ బన్సల్ తీవ్రంగా విమర్శించారు. 'తన సొంత పేరుపైన ద్వేషం ఉన్నందంటే.. అతడు కమ్యూనిస్ట్ మాత్రమే! ఆ ద్వేషం రాముడి మీదనా లేక ఒకరి పేరు మీదనా అనేది చెప్పాలి' అని అన్నారు.

హిందూ మతం ఓ ఫ్రాడ్

ఎస్పీ నేత స్వామి ప్రసాద్ మౌర్య వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: వివాదాస్పద వ్యాఖ్యలకు మారుపేరైన సమాజ్‌వాది పార్టీ నేత స్వామి ప్రసాద్ మౌర్య హిందూ మతంపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఢిల్లీలో జరిగిన జాతీయ బుద్ధిస్ట్, బహుజన హక్కుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ అనేది మతం కాదు.. అదొక మోసం, మరికొంత మందికి ఉపాధి అని విమర్శించారు. దళితులు, గిరిజనులు, బీసీలను హిందువుల పేరిట ఓట్ల కోసం వాడుకుంటూ కుట్ర చేస్తున్నారని అన్నారు. హిందూ అన్నది మతం కాదని, అదో జీవన విధానం అని 1955లో సుప్రీంకోర్టు పేర్కొన్నదని, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఇదే విధంగా పేర్కొన్నారని చెప్పారు.

పాక్ ఎన్నికల బరిలోకి తొలిసారి హిందూ యువతి

పెషావర్, డిసెంబరు 26: పాకిస్థాన్ సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారి ఓ హిందూ మహిళ బరిలోకి దిగుతున్నది. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ బునేర్ జిల్లాలోని జనరల్ స్థానమైన పీకే-25 నుంచి డాక్టర్ సవీరా పర్కార్ పోటీ చేస్తున్నారు. బిలావల్ భుట్టో జర్దారీ నేతృత్వంలోని పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) నుంచి ఆమె నామినేషన్ దాఖలు చేశారు. రిటైర్డ్ డాక్టర్ అయిన సవీరా తండ్రి ఓం పర్కాశ్ 35 ఏళ్లుగా పీపీపీ క్రియాశీలక సభ్యుడిగా ఉన్నారు. సవీరా అబోటాబాద్ మెడికల్ కళాశాల నుంచి ఎంబీబీఎస్ పట్టా పొందారు. ఆమె బునేర్ పీపీపీ మహిళా విభాగానికి ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. పేదల కోసం పనిచేస్తూ తండ్రి అడుగుజాడల్లో నడుస్తానని తెలిపారు.

దశాబ్దాల వివక్షకు చరమగీతం

నిషేధిత వీధిలో తొలిసారి చెప్పులతో నడిచిన దళితులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): తమిళనాడులోని రాజాపూర్ గ్రామంలోని కంబాల నైకెస్ వీధిలో తరతరాలుగా సాగుతున్న వివక్షతకు ఆ గ్రామ ప్రజలు చరమ గీతం పాడారు. నిషేధిత వీధిలో దళితులు తొలిసారి చెప్పులు వేసుకొని తిరిగారు. స్వాతంత్ర్యం తర్వాత ఇక్కడ వీధి మొదట్లో 'వూడూ' అనే బొమ్మను పాతిపెట్టి, దళితులెవరైనా చెప్పులతో ఆ వీధిలోకొస్తే మూడు నెలల్లో చనిపోతారని ప్రచారం చేశారు. దళిత మహిళ ప్రవేశంపై నిషేధం విధించారు. అప్పటి నుంచి దళితులెవరూ ఆ వీధిలో చెప్పులు లేకుండానే నడుస్తూ వచ్చారు.

బీజేపీ హయాంలో 40 వేల కోట్ల స్కామ్

కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ సంచలన వ్యాఖ్య

బెంగళూరు, డిసెంబర్ 26: కర్ణాటక బీజేపీ అసంతృప్త ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాల్ సొంత పార్టీకి తీవ్ర హెచ్చరికలు చేశారు. తనను పార్టీ నుంచి బహిష్కరిస్తే.. యెడియూరప్ప నేతృత్వంలోని మునుపటి బీజేపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భారీ కుంభకోణాన్ని బయటపెడతానని బెదిరించారు. కొవిడ్ సమయంలో రూ.40 వేల కోట్ల స్కామ్ చోటుచేసుకున్నట్టు మంగళవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. బసనగౌడపై చర్యలు తీసుకోవాలని బీజేపీలోని చాలా మంది డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే స్పందించారు. 'వారు(బీజేపీ ప్రభుత్వం) కొవిడ్ సమయంలో పెద్దయెత్తున అక్రమాలకు పాల్పడ్డారు. నోటీసులు ఇచ్చి, నన్ను పార్టీ నుంచి బహిష్కరించనివ్వండి.. వారి అవినీతి బండారం బయటపెడుతా' అని పేర్కొన్నారు.

69కి చేరిన జేఎన్.1 వేరియంట్ కేసులు

కొత్తగా 412మందికి కరోనా పాజిటివ్

న్యూఢిల్లీ: దేశంలో కరోనా కేసులు పెరుగుతూనే ఉన్నాయి. సోమవారం నుంచి మంగళవారం నాటికి 24 గంటల్లో 412 కొత్త కేసులు నమోదయ్యాయి. యాక్టివ్ కేసుల సంఖ్య 4,170కి చేరింది. కరోనాతో ముగ్గురు మరణించారు. కరోనా సబ్ వేరియంట్ జేఎన్.1 కేసులు తాజాగా ఆరు వెలుగుచూశాయి. దీంతో దేశవ్యాప్తంగా ఈ వేరియంట్ కేసుల సంఖ్య 69కి చేరింది. అయితే ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని అధికారులు సూచించారు.

చర్చలు జరపకపోతే కశ్మీర్‌కూ గాజా గతే!

న్యూఢిల్లీ, డిసెంబర్ 26: ఇండియా, పాకిస్థాన్ మధ్య వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోకపోతే గాజా, పాలస్తీనాకు పట్టిన గతే కశ్మీర్‌కు పడుతుందని నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత, జమ్ముకశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. పూంఛ్‌లో ఇటీవల ఉగ్ర దాడి అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 'చర్చలెక్కడ? నవాజ్ షరీఫ్ పాక్ ప్రధాని కాబోతున్నారు. భారత్‌తో చర్చలకు సిద్ధమని వారంటున్నారు. కానీ చర్చించడానికి మనం ఎందుకు సిద్ధంగా లేము?' అని ఆయన ప్రశ్నించారు. మరోవైపు రాజౌరీ-పూంఛ్ ప్రాంతాల్లో కూంబింగ్ ఆపరేషన్ మంగళవారం ఏడో రోజుకు చేరుకుంది.

ఆర్బీఐకి బాంబు బెదిరింపు!

ముంబై: ముంబైలోని ఆర్బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకులకు మంగళవారం ఖిలాఫత్ ఇండియా మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. ప్రైవేటు బ్యాంకులు ఆర్బీఐతో కలిసి భారీ కుంభకోణానికి పాల్పడ్డాయని.. ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కొందరు బ్యాంకు ఉన్నతాధికారులు, ప్రముఖ మంత్రుల పాత్ర ఉన్నదని పేర్కొన్నారు. ఆర్బీఐ గవర్నర్, ఆర్థిక మంత్రి రాజీనామా చేసి కుంభకోణంపై ప్రకటన చేయకుంటే ఒకదాని తర్వాత ఒకటి బాంబులు పేలుస్తామన్నారు. దీంతో పోలీసులు తనిఖీ దళాలతో సోదాలు చేశారు. అయితే ఎక్కడా ఎలాంటి పేలుడు పదార్థాలు దొరకలేదు.

యూఏపీఏ, పీఎంఎల్‌ఏనే కాదు.. బీఎన్ఎస్ఎస్ కిందా బెయిల్ కష్టమే!

న్యూఢిల్లీ, డిసెంబర్ 26: రాష్ట్రపతి ఆమోదంతో మూడు నేర న్యాయ బిల్లులు చట్టాలుగా మారాయి. ఐసీసీ, సీఆర్పీసీ, ఎవిడెన్స్ చట్టాల స్థానంలో భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య(బీఎస్) చట్టాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయా చట్టాల్లోని అంశాలపై చర్చ నడుస్తున్నది. చట్టవిరుద్ధ కార్యకలాపాల చట్టం(యూఏపీఏ), మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద నమోదైన కేసుల్లో మాదిరిగానే ఇకపై బీఎన్ఎస్ఎస్ కేసుల్లో కూడా బెయిల్ పొందడం కష్టంగా ఉంటుందనే వాదన వినిపిస్తున్నది. బీఎన్ఎస్ఎస్‌లోని 479(1), 479(2) తదితర క్లాజులు పలు కేసుల్లో, పలు సందర్భాల్లో బెయిల్ పొందడం కష్టం చేశాయని విశ్లేషిస్తున్నారు.

జేడీయూలో ముసలం

- అధ్యక్ష పదవి నుంచి తప్పుకోనున్న లలన్‌సింగ్?
- సీఎం నితీశ్ పట్ల అసంతృప్తి

స్పెషల్ టాస్క్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జేడీయూలో ముసలం పుట్టింది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు లలన్‌సింగ్ తన పదవికి రాజీనామా చేయబోతున్నారని ప్రచారం జరుగుతున్నది. ఢిల్లీలో ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న జేడీయూ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆయన రాజీనామా చేయబోతున్నట్టు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. సీఎం నితీశ్ వైఖరి నచ్చకనే లలన్‌సింగ్ పార్టీ అధ్యక్ష పదవి నుంచి వైదొలుగుతున్నట్టు చెబుతున్నారు. ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్‌కు నితీశ్ సన్నిహితం కావడం, బీజేపీ రాష్ట్ర నాయకత్వంతో దోస్తీ కారణంగా లలన్‌సింగ్ అసంతృప్తితో ఉన్నట్టు చెబుతున్నారు. లలన్‌సింగ్ రాజీనామా చేశాక ఆ బాధ్యతలను నితీశ్‌కుమార్ స్వీకరించే అవకాశం ఉన్నదని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. అయితే లలన్‌సింగ్ రాజీనామా వార్తలను జేడీయూ ఖండించింది. నితీశ్, లలన్‌సింగ్ మధ్య ఎలాంటి విభేదాలు లేవని, బీజేపీనే వదంతులు సృష్టిస్తున్నదని పార్టీ అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ ప్రసాద్ పేర్కొన్నారు.

మల్లికార్జున ఖర్గే

శరద్‌పవార్

నితీశ్‌కుమార్

ఖర్గే ప్రధాని అభ్యర్థిత్వంపై చిచ్చు

- ఇండియా కూటమిలో విభేదాలు
- ముందే అభ్యర్థిని ప్రకటించక్కర్లేదు
- ఎన్సీపీ అధినేత పవార్ వ్యాఖ్యలు
- జేడీయూ, ఆర్జేడీ కూడా వ్యతిరేకం!

న్యూఢిల్లీ, డిసెంబర్ 26: విపక్ష ఇండియా కూటమిలో ప్రధాని అభ్యర్థిత్వంపై చిచ్చు మొదలైంది. పీఎం అభ్యర్థిపై నిర్ణయం తీసుకోవాలని కూటమిలోని కొన్ని పార్టీలు అభిప్రాయపడుతుండగా.. ఆ అవసరం లేదని ఎన్సీపీ తదితర పక్షాలు అంటున్నాయి. ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఇండియా కూటమి పీఎం అభ్యర్థిగా కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేరును టీఎంసీ అధినేత్రి మమత, ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ప్రతిపాదించిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా ఎన్సీపీ అధినేత శరద్‌పవార్ స్పందించారు. ఎన్నికలకు ముందు పీఎం అభ్యర్థిని ప్రకటించకపోతే ఏమీ కాదని అన్నారు. ఎమర్జెన్సీ తర్వాత 1977లో జరిగిన ఎన్నికల్లోనూ ముందుగా పీఎం అభ్యర్థిని ప్రకటించలేదని, ఎన్నికల తర్వాత మొరార్జీ దేశాయ్ ప్రధాని అయ్యారని గుర్తుచేశారు. మార్పు రావాలని ప్రజలు కోరుకుంటే, దానికి అనుగుణంగా వారు నిర్ణయం తీసుకొంటారని చెప్పారు.

కూటమిలో చీలిక

పలువురు సీనియర్లు కూటమి పీఎం అభ్యర్థిగా నిలిచేందుకు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఖర్గే పేరు ప్రతిపాదనపై బీహార్ సీఎం, జేడీయూ నేత నితీశ్ కుమార్, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ కూడా అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. వీరిద్దరూ సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారని సంబంధిత వర్గాలు తెలిపాయి. నితీశ్‌ను పీఎం అభ్యర్థిగా పేర్కొంటూ బీహార్‌లో పలు చోట్ల పోస్టర్లు కూడా వెలిశాయి.

అసెంబ్లీ ఎన్నికల్లోనూ బహిర్గతం

ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలోనూ విభేదాలు బహిర్గతమయ్యాయి. కూటమిలో పార్టీలు వేర్వేరుగా పోటీచేశాయి. కాంగ్రెస్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎస్పీ, ఆప్ తదితర పార్టీలు పోటీగా అభ్యర్థులను బరిలోకి దింపాయి. సీట్ల పంపకం విషయంలో కాంగ్రెస్ మిత్రద్రోహానికి పాల్పడిందని ఆరోపించిన అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ.. మధ్యప్రదేశ్‌లో సొంతంగా బరిలోకి దిగింది.

సముద్రంలోని ఇంటర్నెట్ కేబుల్స్ కత్తిరిస్తాం

యెమెన్ హౌతీ ఉగ్రవాదుల ప్రకటన

న్యూఢిల్లీ : హమాస్‌కు మద్దతుగా దాడులకు తెగబడుతున్న యెమెన్‌లోని హౌతీ ఉగ్రవాదుల దృష్టి సముద్రగర్భంలోని అంతర్జాతీయ ఇంటర్నెట్ కేబుల్స్‌పై పడింది. ఇజ్రాయెల్, అమెరికా.. వాటి అనుకూల దేశాల్ని దెబ్బతీసే విధంగా ఎర్రసముద్రంలో ఇంటర్నెట్ కేబుల్స్‌ను కత్తిరించి వేస్తామని తాజాగా హెచ్చరికలు జారీచేసింది. ఇందుకోసం బాబ్ అల్-మందాబ్ జలసంధి మీదుగా సముద్ర గర్భం నుంచి వెళ్తున్న ఇంటర్నెట్ కేబుళ్లను కత్తిరించి వేస్తామని బెదిరింపులకు దిగారు. అదే గనుక జరిగితే ప్రపంచానికి ఇంటర్నెట్ సేవలు నిలిచిపోతాయంటూ సోషల్‌మీడియాలో ఓ ప్రకటన విడుదల చేశారు.

ఎవరీ హౌతీలు?

యెమెన్‌లోని తిరుగుబాటు దళాలే 'హౌతీ'లు. ఆ దేశ ఉత్తరభాగంలో వీరి ప్రాబల్యం ఎక్కువ. వీళ్లకి ఇరాన్ నుంచి ఆర్థికంగా, సైనికపరంగా మద్దతు అందుతున్నది. ఇప్పుడు ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా దాడులు చేస్తున్నారు. ఇజ్రాయెల్‌కు వెళ్తున్న వాణిజ్య నౌకలను టార్గెట్ చేశామని ఇప్పటికే ప్రకటించారు. డ్రోన్లు, క్షిపణులతో నౌకలపై దాడులు చేస్తున్నారు. దీంతో ఎర్రసముద్రంలో నౌకా వాణిజ్యం ప్రమాదంలో పడింది.

నేవీ అమ్ముల పొదిలోకి ఐఎన్ఎస్ ఇంఫాల్

ముంబై, డిసెంబర్ 26: స్టెల్త్ గైడెడ్ మిస్సైల్ డెస్ట్రాయర్ 'ఐఎన్ఎస్ ఇంఫాల్' మంగళవారం నేవీ అమ్ములపొదిలోకి చేరింది. దీని పొడవు 163 మీటర్లు. బరువు 7,400 టన్నులు. వేగం గంటకు 30 నాటికల్ మైళ్లు. ఈ నౌకలో క్షిపణి విధ్వంసకర వ్యవస్థ, టోర్పిడో ట్యూబ్స్, యాంటీ సబ్‌మెరైన్ రాకెట్ లాంచర్స్, సూపర్ రాపిడ్ గన్‌మౌంట్, కంబాట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఇలా పలు రకాల అధునాతన అస్త్రాలు ఉన్నాయి. ఇందులో బ్రహ్మోస్ క్షిపణులు కూడా ఉంటాయి. జీవ, అణు, రసాయన పరమైన దాడులను సైతం ఎదుర్కొనే సామర్థ్యం ఈ యుద్ధనౌకకు ఉన్నది.

యుద్ధనౌకల మోహరింపు

వాణిజ్య నౌకపై దాడి నేపథ్యంలో అరేబియా సముద్రంలో యుద్ధనౌకలను నావికాదళం మోహరించింది. నిఘా కోసం పీ-8ఐ నౌక, ఐఎన్ఎస్ మోర్ముగావ్, ఐఎన్ఎస్ కొచ్చి, ఐఎన్ఎస్ కోల్‌కతాలను మోహరించింది. మరోవైపు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ అరేబియాలో వాణిజ్య నౌకపై దాడి చేసిన వాళ్లు సముద్ర గర్భంలో దాకొన్నా పట్టుకుంటామని హెచ్చరించారు. 'అరేబియా సముద్రంలో వాణిజ్య నౌకపై దాడి జరిగింది. వాళ్లు ఎక్కడున్నా పట్టుకుంటాం. సముద్ర గర్భంలో దాచుకున్నా సరే పట్టుకుంటాం' అని తెలిపారు.

జనవరి 1న ఎక్స్‌పోశాట్ ప్రయోగం

బెంగళూరు, డిసెంబర్ 26: ఇస్రో మరో ప్రతిష్టాత్మక ప్రయోగానికి సిద్ధమైంది. బ్లాక్ హోల్స్ (కృష్ణ బిలాలు), న్యూట్రాన్ స్టార్స్.. వివిధ ఖగోళ వస్తువుల నుంచి వెలువడుతున్న అత్యంత తీక్షణమైన ఎక్స్-కిరణాల అధ్యయనానికి మొట్టమొదటిసారిగా పోలారిమెట్రి మిషన్ చేపడుతున్నది. పీఎస్ఎల్‌వీ-సీ58 ద్వారా 'ఎక్స్‌పో-శాట్' శాటిలైట్‌ను జనవరి 1న ఉదయం 9.10 గంటలకు అంతరిక్షంలోకి పంపుతున్నట్టు ఇస్రో తాజాగా వెల్లడించింది. శాటిలైట్‌ను భూమికి 500 నుంచి 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న కక్ష్యలో ప్రవేశపెట్టనున్నది.

సిగరెట్ పీకల నుంచి బయో ఇంధనం!

విల్నియస్, డిసెంబర్ 26: విషపూరితమైన శక్తి వనరులపై ఆధారపడటాన్ని తగ్గించి పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలను కనుగొనేందుకు ప్రపంచవ్యాప్తంగా పరిశోధకులు వినూత్నమైన మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇందులో బయోడీజిల్ ఒకటి. జీవమూలకాల నుంచి తయారుచేసిన బయోడీజిల్ పర్యావరణ అనుకూల శక్తి వనరుగా మారుతున్నా చాలా ఖరీదైనది. దీంతో దీన్ని వాడకానికి ఇప్పటివరకూ అడ్డంకులు ఏర్పడ్డాయి. అయితే, సిగరెట్ పీకలతో ఈ సమస్యకు పరిష్కారాన్ని కనుగొన్నారు లిథువేనియా పరిశోధకులు.

నదిలో ట్రాఫిక్ ఉండదని..!



కొత్త సంవత్సర వేడుకల కోసం హిమాచల్ ప్రదేశ్‌కు పర్యాటకులు పోటెత్తడంతో తలెత్తిన ట్రాఫిక్ కష్టాలను తప్పించుకోవడానికి ఓ వ్యక్తి ఏకంగా లాహాల్ లోయలోని చంద్ర నదిలో వాహనాన్ని నడిపాడు. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఈ ఘటనపై స్థానికులు విమర్శలు వ్యక్తం చేశారు. పోలీసులు డ్రైవర్‌కు చలానా విధించారు.

ఇజ్రాయెల్ ఎంబసీ సమీపంలో పేలుడు

న్యూఢిల్లీ, డిసెంబర్ 26: న్యూఢిల్లీ జిల్లాలోని ఇజ్రాయెల్ దౌత్య కార్యాలయం సమీపంలో మంగళవారం సాయంత్రం పేలుడు చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఎవరూ గాయపడ లేదు. ఘటనా స్థలిలో ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదని అధికార వర్గాలు తెలిపాయి. కార్యాలయం వెనుక భాగంలోని తోటలో ఇజ్రాయెల్ రాయబారిని ఉద్దేశిస్తూ రాసిన ఒక లేఖను పోలీసులు స